9
సాక్షి
జగిత్యాల
శనివారం । 27 । జూలై । 2024

ఘనంగా కార్గిల్ దివస్

కోరుట్ల: పట్టణంలోని కార్గిల్‌చౌరస్తాలో కార్గిల్ దివస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధంలో అమరులైన జవానులకు కొవ్వొత్తులు, కాగడాలతో నివాళి అర్పించారు.


కాగడాలతో నివాళి అర్పిస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీ వద్ద సంబరాలు


నెహ్రూ విగ్రహం వద్ద ఎస్సారెస్పీ అధికారులు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు సాగు, తాగు నీరందించే ఎస్సారెస్పీ ప్రాజెక్టు వద్ద సంబంధిత శాఖ అధికారులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జూలై 26, 1963 రోజున పునాది రాయి వేసిన సందర్భంగా, ప్రాజెక్టు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్‌రావు గుప్తా, ఈఈ చక్రపాణి, డీఎస్ఈ లాల్‌సింగ్, డీఈఈలు గణేశ్, సుకుమార్, రఘుపతి పాల్గొన్నారు.

ప్రాజెక్టులో 28.389 టీఎంసీల నీరు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం శుక్రవారం సాయంత్రం వరకు 28.389 టీఎంసీల(1072.8 అడుగులు)కు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 25,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. 581 క్యూసెక్కులు అవుట్ ఫ్లో వెళ్తోంది.

దళితుల సంక్షేమానికి పెద్దపీట


మాట్లాడుతున్న రమేశ్‌బాబు

జగిత్యాలరూరల్: తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో దళితుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని జిల్లా ఎస్సీసెల్ చైర్మన్ ధర రమేశ్‌బాబు అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో దళితుల సంక్షేమానికి రూ.33,124 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.17,156 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థికశాఖ మంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతమ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీసెల్ జిల్లా వైస్ చైర్మన్ గాలిపల్లి అబి, పల్లె రవి, నక్క జలేందర్, నీలం నర్సయ్య పాల్గొన్నారు.

విషజ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి


ధరూర్‌లో వైద్యపరీక్షలు చేస్తున్న శ్రీనివాస్

జగిత్యాలరూరల్: విష జ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో ఉచిత డెంగీ వైద్యపరీక్షల శిబిరం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 63డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. గ్రామాల్లో నీటి నిలువలు ఉండకుండా చూసుకోవాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ బెనర్జీ, సిబ్బంది ఉన్నారు.

వచ్చే ఐదురోజులు వర్షాలే..

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రాబోయే ఐదు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు సగటున 11.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇబ్రహీంపట్నంలో 13.9మి.మీ, మల్లాపూర్‌లో 24.0మి.మీ, రాయికల్‌లో 12.8మి.మీ, బీర్‌పూర్‌లో 5.8 మి.మీ, సారంగాపూర్‌లో 12.3 మి.మీ, ధర్మపురిలో 8.6 మి.మీ, బుగ్గారంలో 10.6 మి.మీ, జగిత్యాల రూరల్‌లో 9.1 మి.మీ, జగిత్యాల అర్బన్‌లో 10.6 మి.మీ వర్షం కురిసింది. మేడిపల్లిలో 8.2 మి.మీ, కోరుట్లలో 9.5 మి.మీ, మెట్‌పల్లిలో 13.2 మి.మీ, కథలాపూర్‌లో 5.7 మి.మీ, కొడిమ్యాలలో 5.9 మి.మీ, మల్యాలలో 6.0 మి.మీ, పెగడపల్లిలో 14.4 మి.మీ, గొల్లపల్లిలో 14.7 మి.మీ, వెల్గటూర్‌లో 14.1 మి.మీ, ఎండపల్లిలో 17.9 మి.మీ, భీమారంలో 8.1మి.మీ వర్షం కురిసింది.

ఉత్తమ సేవలందించాలి

జగిత్యాలఅగ్రికల్చర్: సహకార సంఘాల ద్వారా రైతులకు మరిన్ని సేవలందించాలని జిల్లా ఇన్‌చార్జి సహకారాధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరణ్ సూచించారు. జిల్లా సహకార సంఘాల అధ్యక్షుల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం రఘువరణ్‌ను కలిసి సహకార సంఘాల పనితీరును వివరించారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. సహకార సంఘాలు ఎరువులు, విత్తనాలు అమ్మడమే కాకుండా, సంఘ అభివృద్ధికి కృషి చేయాలని సభ్యులకు సూచించారు. సంఘ చైర్మన్లు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, వేణుగోపాల్, నరేశ్, మల్లారెడ్డి, మాధవరావు పాల్గొన్నారు.

ఆర్థిక సర్వేలో మెరిసె..

రాజధానికి దీటుగా రోడ్లు

- 'ఉపాధిహామీ'లో కరీంనగర్‌కు రాష్ట్రంలోనే రెండోస్థానం
- తలసరి ఆదాయం, అడవుల పెంపకం ఖర్చులో పెద్దపల్లి టాప్
- చిన్న, మధ్య తరహా యూనిట్లలో జగిత్యాల ముందంజ
- వ్యవసాయ కనెక్షన్లు రాజన్నసిరిసిల్లలో ఎక్కువ
- బడ్జెట్‌లో భాగంగా సామాజిక, ఆర్థిక సర్వే–2024 వెల్లడి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మనిషికి రక్తనాళాలు ఎలాగో.. దేశ ఆర్థిక వ్యవస్థకు రోడ్లు అంతే ముఖ్యం. వాటి విస్తరణలో రాష్ట్ర రాజధాని తర్వాత అత్యధికంగా రోడ్లు మన ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వ ప్రణాళిక విభాగం విడుదల చేసిన ఆర్థిక సర్వే–2024 నివేదిక వెల్లడించింది. వివిధ రంగాల వారీగా సమగ్ర అభివృద్ధికి కృషి చేయడంతో తలసరి ఆదాయం పెరిగింది. ఉపాధిహామీ ద్వారా పనిదినాలు కల్పించడంలో నాలుగు జిల్లాలు పోటీ పడుతున్నాయి. కంపా నిధుల్లో పెద్దపల్లి అగ్రభాగాన, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల్లో జగిత్యాల ముందంజలో.. రైతుల వద్ద సగటు భూమిలో సిరిసిల్ల శిఖర స్థానంలో నిలిచాయి.

రోడ్డు డెన్సిటీలో బెటర్..

రాష్ట్రంలో రోడ్డు డెన్సిటీ 100 చదరపు కిలోమీటర్లుకు 98.8 కి.మీ. రహదారులుండగా, జిల్లాల వారీగా చూస్తే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ తర్వాత కరీంనగర్ జిల్లానే ఎక్కువ రోడ్డు డెన్సిటీ కలిగి ఉంది.

ర్యాంకు	జిల్లా	రోడ్డు డెన్సిటీ
4	కరీంనగర్	137.4
11	సిరిసిల్ల	112.4
18	పెద్దపల్లి	97.2
13	జగిత్యాల	107.2

తలసరి ఆదాయం..

దేశంలో ప్రతీ వ్యక్తి సంపాదించిన డబ్బు మొత్తాన్ని కొలవడాన్ని తలసరి ఆదాయం అంటారు. ఒక వ్యక్తి ఏడాదిలో సంపాదించిన మొత్తం, ఆయా జిల్లాల జనాభాతో సరిపోల్చి చెప్పేదే తలసరి ఆదాయం. రాష్ట్రంలో పెద్దపల్లి 13వ స్థానంలో ఉండగా, ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది.

జిల్లా	తలసరి ఆదాయం	ర్యాంకు
పెద్దపల్లి	2,31,766	13
కరీంనగర్	22,628	16
సిరిసిల్ల	1,95,479	28
జగిత్యాల	1,83,094	31

రైతు సగటు భూమి రెండెకరాల్లోపే..

వ్యవసాయ లెక్కల ప్రకారం రైతుల వద్ద సగటు వ్యవసాయ భూమి చాలా తక్కువగా ఉంది. ఒక్కో రైతు వద్ద 1.5 హెక్టార్లతో ఆదిలాబాద్ ప్రథమ స్థానంలో ఉంది. రాజన్నసిరిసిల్ల 0.83 (22వ స్థానం) హెక్టార్లు, జగిత్యాల 0.77(26వ స్థానం) హెక్టార్లు, పెద్దపల్లి 0.76(27వ స్థానం) హెక్టార్లు, కరీంనగర్ 0.75(29వ స్థానం) హెక్టార్లు ఉన్నాయి.

పచ్చదన పెంపునకు ఖర్చు..

రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా అడవుల పెంపకం, సంరక్షణ కోసం తీసుకున్న చర్యలతో అడవుల విస్తీర్ణం క్రమేపీ పెరుగుతోంది. ఇందుకోసం కేటాయించిన కంపా నిధుల్లో అత్యధికంగా పెద్దపల్లిలో 81.20 శాతం ఖర్చు చేయగా, రాజన్న సిరిసిల్లలో 52.46 శాతం, జగిత్యాలలో 43.92 శాతం, కరీంనగర్‌లో 73.60 శాతం నిధులు పచ్చదన పెంపు కోసం ఖర్చు చేస్తున్నారు.

విద్యుత్ కనెక్షన్లలో భేష్..

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ, ఇండస్ట్రియల్ విద్యుత్ కనెక్షన్లలో కరీంనగర్ టాప్‌లో ఉండగా, వ్యవసాయ కనెక్షన్లు రాజన్నసిరిసిల్ల, ఇండస్ట్రియల్ కనెక్షన్లు కరీంనగర్‌లో ఎక్కువగా ఉన్నాయి.

ర్యాంకు	జిల్లా	గృహ (శాతం)	వ్యవసాయ (శాతం)	ఇండస్ట్రియల్ (శాతం)
14	కరీంనగర్	68.4	18.6	13
15	పెద్దపల్లి	68.2	21.3	10.6
21	జగిత్యాల	63.6	26.2	10.1
26	సిరిసిల్ల	61.4	27.3	11.2


పెరిగిన పనిదినాలు..

ఉమ్మడి జిల్లాలో అన్ని జిల్లాలు లక్ష్యానికి మించి ఉపాధిహామీ పనిదినాలు కల్పించడంలో పోటీ పడ్డాయి. గతేడాది కంటే ఎక్కువ పనిదినాలు కల్పించారు. అత్యధికంగా కరీంనగర్ 129 శాతంతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలవగా, రాజన్నసిరిసిల్ల 5వ, జగిత్యాల 9వ, పెద్దపల్లి 10వ స్థానాల్లో నిలిచాయి.

జిల్లా	పనిదినాల లక్ష్యం (లక్షల్లో)	కల్పించింది (లక్షల్లో)	శాతం
కరీంనగర్	22.2	28.7	129
సిరిసిల్ల	17.6	21.8	124
జగిత్యాల	30.7	37.3	122
పెద్దపల్లి	20.6	25.0	121


వ్యవసాయ రంగంలో ఎక్కువ మంది..

ఉమ్మడి జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నా ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయం రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. మొత్తం జనాభాలో సగటున 52 శాతం మంది వ్యవసాయాధారిత పనుల్లోనే ఉన్నారు.




రేషన్ కార్డులే అధికం..

ఉమ్మడి జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు, రేషన్ కార్డులు కుటుంబాల కంటే అధికంగా ఉన్నాయి. ఇవి అన్నపూర్ణ, అంత్యోదయ, ఆహార భద్రతకు సంబంధించినవి. రేషన్ కార్డుల్లో జగిత్యాల, గ్యాస్ కనెక్షన్లలో కరీంనగర్ టాప్‌లో ఉన్నాయి.



పారిశ్రామికంగా పురోగతి..

సహజ వనరులకు నిలయమైన ఉమ్మడి జిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో పురోగతిలో ఉంది. గ్రానైట్, బొగ్గు ఆధారిత, ఆహార పరిశ్రమల ఏర్పాటుతోపాటు చిన్న, సూక్ష్మ, పరిశ్రమల స్థాపనలో మరింత ప్రగతి సాధిస్తే ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వలసలు ఆగిపోయే అవకాశం ఉంది.



నాణ్యమైన విద్యనందించాలి

- ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలి
- కలెక్టర్ సత్యప్రసాద్


ఇబ్రహీంపట్నం మోడల్‌స్కూల్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మోడల్‌స్కూల్‌ను తనిఖీ చేశారు. ఆరోతరగతిలో ఓ విద్యార్థికి హిందీ రాయడం, చదవడం రాకపోవడంతో సరిగా బోధించడం లేదా అంటూ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. చాలా మందికి ఇంగ్లిష్ మీడియంలో బోధించడం రావడంలేదని, ఇంగ్లిష్ రాని ఉపాధ్యాయులు స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులకు వెళ్లాలని సూచించారు. వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా బోధించాలన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం కొత్త బస్టాండ్ వద్ద మరుగుకాలువను, ఎర్దండి గోదావరిని పరిశీలించారు. ఆర్డీవో శ్రీనివాస్, డీఈవో జగన్‌మోహన్ రెడ్డి, తహసీల్దార్ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు, ఆర్ఐ రమేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు గుర్తించాలి

జగిత్యాల: మండలాలవారీగా ప్రభుత్వ భూములను గుర్తించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ధరణి, ప్రజావాణి ఫిర్యాదులు, వక్ఫ్ భూములు, ప్రభుత్వ భూములపై చర్చించారు. మండలాలవారీగా ప్రభుత్వ భూమిని గుర్తించాలని తహసీల్దార్లకు సూచించారు. భూ వివాదాలు, కోర్టు కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి


ముత్యంపేటను సందర్శించిన డీఎంహెచ్‌వో

మల్లాపూర్: వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సమియోద్దీన్ సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉంచుకోవడంతో పాటు దోమలను నివారిస్తే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండలంలో డెంగీ కేసులు నమోదైన ముత్యంపేట గ్రామాన్ని సందర్శించారు. బాధితుల ఇళ్లవద్ద నిల్వ ఉన్న నీటిలో లార్వాలను గుర్తించారు. నీటిగుంటల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం ఇంటింటా వర్షాకాలం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ వాహిని, సీహెచ్‌వో రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ఎందుకు కాలేదు?

- 'సాక్షి' కథనాలపై స్పందించిన ప్రభుత్వం
- రుణమాఫీ కాని వారి జాబితా పంపాలని ఆదేశం
- పల్లెవేదికల్లో ఏఈవోల గ్రీవెన్స్ రిజిస్టర్



సాక్షిప్రతినిధి,కరీంనగర్: రుణమాఫీ విషయంలో 'సాక్షి' వరుస కథనాలపై ప్రభుత్వం స్పందించింది. అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో రుణంరాని రైతుల వివరాలు కనుక్కుని, జాబితా రూపొందించి నివేదిక పంపాలని ఉమ్మడి జిల్లాలోని ఏఈవో (అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్)లకు ఆదేశాలు జారీచేసింది. దీంతో వారు తమ క్లస్టర్ పరిధిలో ఉన్న రైతుల నుంచి ఏ కారణాలతో రుణాల మాఫీ జరగలేదన్న విషయంపై దృష్టిసారించారు. ఈనెల 20, 21న 'సాక్షి' ప్రచురించిన కథనంలో కూచనపల్లి రాజు వద్దకు వెళ్లిన వ్యవసాయాధికారులు త్వరలోనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం గమనార్హం. ఇందులో భాగంగా బాధిత రైతుల వద్దకు వారే వెళ్లడం లేదా రుణమాఫీ జరగలేదంటూ రైతు వేదికల వద్దకు వచ్చే ఫిర్యాదులను నమోదు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ రిజిస్టర్ ఏర్పాటు చేసుకున్నారు. మొత్తంగా ఏ కారణాలతో రుణమాఫీ జరగలేదన్న విషయంపై త్వరలోనే ప్రభుత్వానికి క్లస్టర్లవారీగా నివేదిక పంపనున్నారు.

రైతులు చెప్పే కారణాలివీ..

- కుటుంబ రేషన్‌కార్డు లేని వారికి గుర్తింపు జరగలేదు ఫలితంగా తమకు రుణమాఫీ జరగలేదని రైతులు ఆరోపిస్తున్నారు.
- ఆధార్ మిస్‌మ్యాచ్..ఆధార్ కార్డులో పేరుకు, బ్యాంకు పాస్‌బుక్కులో పేరు స్పెల్లింగ్‌లో వ్యత్యాసం ఉన్నా.. వారికి రుణమాఫీ వర్తించలేదు.
- పాస్‌బుక్కులేని వారికి రుణం రాలేదు.
- లోన్ తీసుకున్నపుడు మైనర్లు ఇపుడు మేజర్ అయినా వారి పేరు రాలేదు.
- బ్యాంకు మేనేజర్ల ఒత్తిడితో బలవంతంగా ముందే లోను కట్టిన వారికి మాఫీ వర్తించలేదు.
- రుణం తీసుకుని మరణించిన వాళ్ల విషయంలోనూ ఇదే జరిగింది. వారి కుటుంబ సభ్యులు బ్యాంకు అధికారుల ఒత్తిడి రుణం కట్టగా.. తీరా ఇపుడు మాఫీ అమలవలేదు.
- గత ప్రభుత్వ హయాంలో సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ జరగని ఖాతాలకు పథకం అమలు కాలేదు.

ప్రభుత్వ కారణాలివీ..

వాస్తవానికి ప్రభుత్వం మొదటి నుంచి చెబుతున్నట్లుగా తాను విధించిన నిబంధనల మేరకు మాఫీ చేసింది.

- కాలపరిమితి 12–12–2018 నుంచి 09–12–2023 లోపల రుణం తీసుకోని వారికి వర్తించలేదు.
- 09–12–2023 నాటికిలోను ఖాతాలో ఉన్న అవుట్ స్టాండింగ్ అమౌంట్ ఎంత ఉంటే అంత మాత్రమే మాఫీ అయ్యింది.
- రేషన్‌కార్డు లేని వారికి రుణాలు మాఫీ కాలేదు. ప్రభుత్వం పాసుబుక్కులు ప్రామాణికం అని చెప్పినప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం అది పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు.
- రుణం రీషెడ్యూల్ చేసుకున్న వారికి కూడా రుణమాఫీ జరగలేదు.
- వీటితోపాటు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వర్తించని వారికి కూడా రుణమాఫీ అవలేదు.

గురుకులంలో కలకలం

మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి మృతి చెందడం కలకలం రేపుతోంది. విషయం తెలుసుకున్న మిగతా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. - వివరాలు 10లో▸



ముసురు.. మురుగు



- జిల్లాకేంద్రంలోని బైపాస్‌రోడ్డు పక్కన సాయిబాబా ఆలయం సమీపంలోని డ్రైనేజీ ఇది. కాలువలో మురుగునీరు ముందుకు కదలడం లేదు. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులు, సంచులతో నిండిపోవడంతో ఈ వర్షాకాలం మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఫలితంగా పందులు, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- ఎల్జీగార్డెన్స్ నుంచి నర్సింగాపూర్‌కు వెళ్లే రహదారి పక్కన పెద్ద డ్రైనేజీ ఉంది. ఇందులోని నీరు ఎటు వెళ్తుందో తెలియని పరిస్థితి. సమీపంలో పిచ్చిమొక్కలు ఉండటంతో పందులు సావాసం చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ నీరు తొలగించేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.



- బిల్డింగ్‌లు కన్పించకుండా పిచ్చిమొక్కలు పెరిగిన ఈ ఫొటో విద్యానగర్ కాలనీలోనిది. వర్షానికి ఈ ఖాళీస్థలంలో నీరు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. రాత్రిపూట దోమలతో సావాసం చేస్తున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. యజమానులు ఖాళీస్థలాలను పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి.

- ఖాళీ స్థలాల్లో పెరుగుతున్న పిచ్చిమొక్కలు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- నిలుస్తున్న వర్షపునీరు.. అస్తవ్యస్తంగా డ్రైనేజీలు
- పట్టణంలో పడకేసిన పారిశుధ్యం
- వ్యాధులవ్యాప్తితో జగిత్యాల ప్రజల భయాందోళన

- తులసీనగర్ చివరిలోని చింతకుంట చెరువు సమీపంలోని కాలువ ఇదీ. ఈ కాలువను ఆనుకుని చెరువు ఉంటుంది. కాలువకు ఒకవైపు మొత్తం ఇళ్లుంటాయి. ఖాళీ స్థలాలల్లో ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగాయి. కనీసం తొలగించకపోవడంతో అందులోనే మురికినీరు నిలుస్తోంది. చుట్టుపక్కల ప్రజలు ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పట్టణంలో వార్డులు:	48
జనాభా :	1,20,357
పారిశుధ్య :	296

జగిత్యాల: వర్షాకాలంలో ఓ వైపు ముసురు పెడుతుంటే.. మరోవైపు ఖాళీస్థలాల్లో మురుగునీరు నిలుస్తోంది. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో నీరు రోడ్లపైకి, ఇళ్ల సముదాయాలకు చేరుతోంది. ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు ఇబ్బందులు పెడుతుండగా.. జిల్లాకేంద్రం అంతటా ఈ సమస్య వేధిస్తోంది. ముఖ్యంగా విద్యానగర్, తులసీనగర్, బైపాస్‌రోడ్, గోవిందుపల్లితో పాటు శివారుకాలనీల్లో ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలను తొలగించాలని ప్లాట్ యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

ఖాళీ స్థలాలతోనే ఇబ్బంది

పట్టణంలోని చాలా ప్రాంతాల్లో ఇళ్ల మధ్య ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. యజమానులు పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి విషపురుగులు, పాములు, దోమలు, ఈగలతో ప్రజలు పరేషాన్ అవుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ బారి న పడుతున్నారు. సాయంత్రం ఆరుదాటిందంటే తలుపులు పెట్టుకుంటే తప్పా బతకడం కష్టంగా మారిందని అంటున్నారు. అంతేకాక ప్రధాన రహదారుల్లోని డ్రైనేజీలోని చెత్తాచెదారాన్ని తొలగించే ప్రయత్నంచేయడం లేదు. నిబంధనల ప్రకారం బల్దియా అధికారులు వారి వాహనాలతో స్థలాలను చదును చేయించి, యజమాని ద్వారా బిల్లు చెల్లించుకోవచ్చు. కానీ ఇది ఎక్కడ జరగడం లేదు. వర్షాకాలంలో ఫాగింగ్ చేయాల్సి ఉండగా మచ్చుకు సైతం కన్పించడం లేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

మున్సిపాలిటీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీల నిర్మాణం సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే పొంగి పొర్లుతున్నాయి. పూడిక తీయకపోవడంతో పూర్తిగా నిండిపోయి మురికినీరంతా రోడ్లపైకి వెళ్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోవడంతో కాలనీలు, రోడ్లవెంట దుర్గంధం వెదజల్లుతోంది.

చర్యలు తీసుకుంటున్నాం



పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలను తొలగించని యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం. ఖాళీ స్థలాల్లో ఉన్న పిచ్చిమొక్కలను, డ్రెయినేజీలో నిలిచిన నీటిని తొలగించేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. ఒకవేళ వారు స్పందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. – సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

వర్షానికి కూలిన ఇంటి గోడ



పాలకుర్తి: వర్షాలకు మండలంలోని పుట్నూర్ గ్రామానికి చెందిన మడక పోచయ్య ఇంటి గోడ శుక్రవారం కూలింది. వ్యవసాయ కూలీ అయిన పోచయ్య ఇంటి గోడలు కూలడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి సాయం అందించాలని వేడుకుంటున్నారు.

పురుగుల మందుతాగి రైతు ఆత్మహత్య



లక్ష్మయ్య(ఫైల్)

ముత్తారం: ముత్తారం మండలం కేశనపల్లికి చెందిన మాటేటి లక్ష్మయ్య (55) అనే రైతు శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, ఎస్సై మధుసూదన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మయ్య రెండేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయమే పత్తి చేనుకు మందు కొట్టేందుకు వెళ్లి మందు కొట్టడం పూర్తయ్యాక అదే మందును తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మయ్యను పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లున్నారు. భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు.

ఉరేసుకొని యువకుడు..



కాసాని వినోద్(ఫైల్)

రామగిరి: మండలంలోని నాగెపల్లి గ్రామానికి చెందిన కాసాని వినోద్ (32) శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తున్న వినోద్ ఏడాది క్రితం బైక్ ప్రమాదానికి గురై చికిత్స పొంది ఇంటి వద్దే ఉంటున్నాడు. ఏమి పనిచేయకుండా ఉంటూ బాధపడుతుండేవాడు. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం తెల్లవారుజామున లేచి ఇంటి వరండాలో గల రేకుల షెడ్డుకు ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి 108కు సమాచారం అందించగా సిబ్బంది పరీక్షించి మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.సందీప్‌కుమార్ తెలిపారు. మృతుడికి రెండేళ్ల ఇద్దరు కవల అమ్మాయిలు ఉన్నారు.

యువతి అదృశ్యం

కథలాపూర్: కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతి అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్ కుమార్ శుక్రవారం తెలిపారు. యువతి గురువారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వాకాబు చేశారు. అయినప్పటికీ ఆచూకీ లభించలేదన్నారు. కుటుంసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాయికల్‌లో మహిళ..

రాయికల్: రాయికల్‌కు చెందిన ముక్కెర జ్యోతి (27) అదృశ్యమైనట్లు ఎస్సై అశోక్ శుక్రవారం తెలిపారు. జ్యోతి ఈనెల 25న మధ్యాహ్నం ఇంట్లోంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని, తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమెభర్త ముక్కెర రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెద్దాపూర్ గురుకులంలో కలకలం

- అర్ధరాత్రి అస్వస్థతకు గురైన విద్యార్థి
- ఆస్పత్రికి తరలించిన కుటుంబ సభ్యులు
- అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడి నిర్ధారణ
- భయంతో ఇంటికి వెళ్లిన పలువురు విద్యార్థులు



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి మృతి చెందడం కలకలం రేపుతోంది. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఆరపేట గ్రామానికి చెందిన రాజారపు గణాధిత్య(13) గురువారం అర్ధరాత్రి వసతి గృహంలో అస్వస్థతకు గురయ్యాడు. 1:30నిమిషాల సమయంలో అస్వస్థతకు గురైన బాలుడు, కొద్దిసేపటికే మరోమారు తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి విద్యార్థులు కేర్‌టేకర్ వెంకట్‌కు సమాచారం ఇచ్చారు. అతను ప్రిన్సిపాల్ విద్యాసాగర్ ద్వారా తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేశారు. అక్కడికి చేరుకున్న కుటుంబసభ్యులు తమ కుమారున్ని మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించాడు. విద్యార్థి మృతిపై ఇన్‌చార్జ్ ఎంఈవో భీమయ్య, కోరుట్ల ఎస్సై కిరణ్ విచారణ జరిపారు.

నిర్వాహకుల నిర్లక్ష్యం

తమ కొడుకు అస్వస్థతకు గురైనట్లు సమాచారం ఇచ్చిన నిర్వాహకులు ఆస్పత్రికి తరలించే విషయంలో నిర్లక్ష్యం వహించినట్లు బాధిత కుటుంబసభ్యులు ఆరోపించారు. త్వరగా ఆస్పత్రికి తరలిస్తే అపాయం తప్పేదని ఆవేదన వ్యక్తం చేశారు. వసతిగృహంలోని నర్సింగ్ ఆఫీసర్ ఇటీవలే వేరే చోటుకు బదిలీ కావడంతో ప్రాథమిక చికిత్స సైతం అందలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మరో ఇద్దరికి పాముకాటు..?

పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న మరో ఇద్దరు విద్యార్థులు గణేశ్, హర్షవర్ధన్ తమకు ఏదో కుట్టినట్లుగా ఉందని చెప్పగా వారిని మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించారు. వారిద్దరూ పాముకాటుకు గురైనట్లు వైద్యులు అనుమానించి, నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి నిలకడగా ఉంది. గణాదిత్య సైతం పాముకాటుకు గురయ్యాడా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ విషయమై ఎస్సైని వివరణ కోరగా.. తమ కొడుకు అనారోగ్యంతోనే మృతి చెందినట్లు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని.. పూర్తి విచారణ చేస్తున్నామని ఎస్సై కిరణ్ కుమార్ వివరించారు.

భయంతో విద్యార్థులు ఇంటికి

గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి మృతి చెందడం, మరో ఇద్దరిని ఆస్పత్రికి తరలించారన్న విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. కొందరు పాఠశాలకు వద్దకు హుటాహుటిన చేరుకున్నారు. తమ కుమారుల పరిస్థితి ఎలా ఉందని తెలుసుకొని తిరిగి వెళ్లగా, మరికొందరు తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు.

బాధిత కుటుంబంలో తీరని విషాదం

మండలంలోని ఆరపేటకు చెందిన చెందిన రాజారపు లావణ్య– మహేశ్‌కు ముగ్గురు కుమారులు. ఇందులో ఇద్దరు కుమారులు ఇప్పటికే పలు అనారోగ్య కారణాలతో చనిపోయారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు సైతం చనిపోవడం బాధిత కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. బాలుడి మృతితో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.

ధాన్యం ఇస్తారా... డబ్బు చెల్లిస్తారా!

- మిల్లర్లకు ధాన్యం అప్పగింత గండం
- డబ్బులు చెల్లించాలని కాంట్రాక్టర్ ఒత్తిడి
- ఆందోళన చెందుతున్న మిల్లర్లు
- నిత్యం అధికారుల తనిఖీలు



రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న అధికారులు

జగిత్యాలక్రైం: రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లకు అప్పగించారు. వారు ధాన్యాన్ని బియ్యం చేసి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా, బియ్యం సేకరించకపోవడంతో మిల్లర్ల వద్దే పెద్దఎత్తున పేరుకుపోయింది. గత ప్రభుత్వం 2022–23 రబీలో రాష్ట్రవ్యాప్తంగా 35లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని టెండర్ ద్వారా విక్రయించింది. జిల్లాకు చెందిన 64 మంది రైస్‌మిల్లర్లు 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సి ఉంది.

రూ.2,007కు కొనుగోలు చేసిన కాంట్రాక్టర్

రాష్ట్రవ్యాప్తంగా రైస్‌మిల్లర్ల వద్దనున్న ధాన్యాన్ని ప్రభుత్వం అమ్మకానికి టెండర్లు పిలవగా కర్నాటకు చెందిన మంచుకొండ ఆగ్రోస్ వారు రూ.2,007కు క్వింటాలు చొప్పున కొనుగోలు చేసేందుకు టెండర్ వేశారు. దీంతో వారు మిల్లర్ల వద్ద నుంచి తీసుకుంటున్న ధాన్యాన్ని హైదరాబాద్‌కు చెందిన హిందుస్థాన్ ప్రైవేటు లిమిటెడ్‌కు అప్పగించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో జిల్లాలో 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లర్ల నుంచి తీసుకోవాల్సి ఉండగా కాంట్రాక్టర్ మాత్రం రైస్‌మిల్లర్ల నుంచి క్వింటాలుకు రూ.2,223 చొప్పున చెల్లించాలని ఒత్తిడి పెంచుతున్నారు.

చెల్లించకుంటే తనిఖీలు

రైస్‌మిల్లర్లు 2022–23 సంవత్సరానికి గాను రబీలో తీసుకున్న ధాన్యాన్ని ప్రభుత్వం బియ్యం సేకరించకపోవడంతో కాంట్రాక్టర్‌కు ధాన్యాన్ని విక్రయించింది. కాంట్రాక్టర్‌కు మిల్లర్లు ధాన్యం అప్పగించాల్సి ఉంది. కాంట్రాక్టర్ మాత్రం ధాన్యం లేని మిల్లర్ల వద్ద క్వింటాలుకు రూ.2007 వసూలు చేయాల్సి ఉండగా ప్రస్తుతం కాంట్రాక్టర్ రూ.2223 చెల్లించాలని ఒత్తిడి పెంచుతున్నాడు. దీంతో ఒక్కో మిలర్ రూ.216 చొప్పున నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం ఇచ్చేందుకే మిల్లర్లు సుముఖం

జిల్లాలో చాలా మంది రైస్‌మిల్లర్లు తమవద్దనున్న ధాన్యాన్నే కాంట్రాక్టర్‌కు అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నారు. కాంట్రాక్టర్ మాత్రం ఇప్పటి వరకు ఏ ఒక్క మిల్లర్ వద్ద ధాన్యం తీసుకోలేదు. డబ్బే చెల్లించాలని ఒత్తిడి పెంచుతుండటంతో మిల్లర్లు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం లేని మిల్లర్లు కూడా తాము కాంట్రాక్టర్ కోడ్ చేసిన రేటు ప్రకారమే డబ్బులు చెల్లిస్తామని, అదనంగా డబ్బులు చెల్లించడంసాధ్యంకాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం అప్పగించాలి



జిల్లాలో 2022–23 రబీలో సేకరించిన ధాన్యం 64 మంది రైస్‌మిల్లర్లకు 2.20 లక్షల మెట్రిక్‌టన్నులు అప్పగించడం జరిగింది. ప్రభుత్వం ఆ ధాన్యాన్ని టెండర్‌ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. మిల్లర్లు ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం అప్పగించాలి. – వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

ముగిసిన 'కేంద్రీయ' బాలికల బ్యాడ్మింటన్ పోటీలు



మెడల్స్ అందిస్తున్న ప్రిన్సిపాల్ శోభన్‌బాబు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లో రెండు రోజులుగా జరుగుతున్న హైదరాబాద్ రీజియన్ కేంద్రీయ విద్యాలయాల అండర్ 14, 17, 19 బాలికల బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శోభన్‌బాబు మెడల్స్ అందించి మాట్లాడుతూ వితలైన బాలికలు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. పోటీల్లో 36 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పూర్తి సహకారం అందించిన ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యంకు కృతజ్ఞతలు తెలిపారు.

విజేతల వివరాలు

- అండర్ 14 విభాగంలో ఎస్.మనస్వి (పికెట్), రాచికుమారి(కళింగ), హనిషత(బొల్లారం)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.
- అండర్–17 విభాగంలో ఎస్.శ్రీజ(పికెట్), దండు తేజస్విని(నల్గొండ), ఏంజిల్(గచ్చిబౌళి)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుచుకున్నారు.
- అండర్–19 విభాగంలో జాహ్నవి ప్రియ(కాకినాడ), సహస్ర(పికెట్)లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.

గల్ఫ్‌లో గుండెపోటుతో కట్లకుంటవాసి మృతి

మేడిపల్లి: మేడిపల్లి మండలానికి చెందిన మరో గల్ఫ్ కార్మికుడు గుండెపోటుతో చనిపోయాడు. మండలంలోని కట్లకుంట గ్రామానికి చెందిన నూతిపల్లి లక్ష్మణ్(44) నాలుగేళ్లుగా గల్ఫ్ వెళ్తున్నాడు. దుబాయిలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులకు వెళ్లివచ్చి తనగదిలో గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. గదిలో ఉన్న తోటి కార్మికులు ఆస్పత్రికి తరలిస్తుండగా అప్పటికే చనిపోయాడు. కట్లకుంటలో ఉన్న కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో తీవ్ర విషాదం అలుముకుంది. లక్ష్మణ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

మేడిపల్లి: భీమారం మండలం మన్నెగూడెం గ్రామంలోని రెండు ఆలయాల్లో చోరీ జరిగింది. మన్నెగూడెం శివారులోని శివాలయం, మల్లికార్జున ఆలయాల్లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి, హుండీ తాళాలు పగులగొట్టి, నగదు చోరీ చేశారు. శుక్రవారం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై శ్యాంరాజ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రాజారం పాఠశాలలో కంప్యూటర్ చోరీ

మల్యాల: మల్యాల మండలం రాజారం ప్రాథమికోన్నత పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు కంప్యూటర్ ఎత్తుకెళ్లారు. కంప్యూటర్ గది తాళం పగులగొట్టి మానిటర్, సీపీయూ ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం పాఠశాల వచ్చిన ఉపాధ్యాయులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గని ప్రమాద కారకులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

రామగిరి: సింగరేణిలో జరుగుతున్న గని ప్రమాదాలకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. శుక్రవారం ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2లో డివిజన్ ఉపాధ్యక్షుడు ఆర్మాల ప్రసాద్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా, నివారణ చర్యలు పాటించడంలో అధికారులు విఫలమయ్యారని అన్నారు. ఐదేళ్లలో 39మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి సారంగపాణి, ఆర్జీ–3 ఏరియా కార్యదర్శి రౌతు రమేశ్, ఫిట్ కార్యదర్శి మద్రి సంతోశ్, ఎండీ జానీమియా, కాసెట్టి నగేశ్, కొండ్ర ఐలయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీకి రూ.139 కోట్ల కేటాయింపు హర్షణీయం

- ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జువ్వాడి కృష్ణారావు

మల్లాపూర్: నిజాం షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షణీయమని ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ముత్యంపేట శివారులోని నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణకు బడ్జెట్‌లో రూ.139కోట్లు కేటాయించడం కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోందన్నారు. ఈ సందర్భంగా సీఎంరేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, నల్ల బాపురెడ్డి, నర్సయ్య, ఏలేటి వెంకట్‌రెడ్డి, గడ్డం లింగారెడ్డి, చిన్నారెడ్డి, సాయికుమార్, మహిపాల్‌రెడ్డి, పూదరి నర్సాగౌడ్, జెట్టి లింగం, రాజం పాల్గొన్నారు.

నీటమునిగి గొర్రెల కాపరి మృతి



మొగిలి బొందయ్య(ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన మొగిలి బొందయ్య (75) గొర్రెను కాపాడబోయి నీటమునిగి మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసుల తెలిపిన వివరాలు...రోజు మాదిరిగానే శుక్రవారం గొర్రెలను గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. మందలోని గొర్రెపిల్ల బొడ్డ శంకర్‌కు చెందిన వ్యవసాయబావిలో పడింది. దాన్ని కాపాడేందుకు వ్యవసాయబావిలోకి దిగడంతో ప్రమాదవశాత్తు నీటమునిగాడు. విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు మృతదేహం కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో చిగురుమామిడి ఎస్సై బి. రాజేశ్ గజ ఈతగాళ్లను రప్పించారు. రెండు మూడు గంటల పాటు గాలించగా సాయంత్రం బొందయ్య మృతదేహం లభ్యమైంది. కొడుకు మొగిలి ఓదెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అధిక కమీషన్ ఆశ.. అసలుకే మోసం

- ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడి
- బోర్డు తిప్పేసిన సంస్థ
- రూ.లక్షల్లో నష్టం
- సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించిన బాధితులు



సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు

గోదావరిఖని: మే నెలలో రూ.30వేలతో ప్రారంభిస్తే రోజుకు రూ.500 చొప్పున తిరిగి ఖాతాలో జమయ్యాయి. రోజువారీగా అధిక మొత్తంలో వస్తున్నాయనే ఆశతో రూ.3లక్షల వరకు పెట్టుబడి పెట్టా. గత శనివారం నుంచి ఆన్‌లైన్‌లో యాప్ మొత్తానికి కనపడకుండా పోయిందని దేవరాజ్ అనే బాధితుడు వాపోయాడు. మంచిర్యాలకు చెందిన ఓవ్యక్తి నాకు ఈ సంస్థను పరిచయం చేశాడని తెలిపారు.. ఇలా కరీంనగర్, మంచిర్యాల, సిద్దిపేట్ జిల్లాల్లో 600మందికి పైగా దాయ్ ఆప్ బాధితులున్నారు. ప్రతినెలా అధిక కమిషన్ వస్తుందని ఆశపడి అసలుకే మోసపోయారు. ఆన్‌లైన్ యాప్‌లో అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టి పెద్ద మొత్తంలో నష్టపోయారు. మొదటగా కొద్ది మొత్తంలో డబ్బులు సేకరించిన యాప్ నిర్వాహకులు మూడు, నాలుగు నెలలు కమీషనర్‌ను క్రమం తప్పకుండా చెల్లించారు. ఆతర్వాత ఏలాగూ కమీషన్ వస్తుందనే ఆశతో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టారు. మంచిర్యాల జిల్లాలో ఉన్న కొందరు వ్యక్తులు యాప్‌లో పెట్టుబడి పెట్టామంటూ ప్రోత్సహించారని బాధితులు శుక్రవారం గోదావరిఖని సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట, మంచిర్యాల, కరీంనగర్ ప్రాంతాలకు చెందిన బాధితులు దాయ్ అనే ఆన్‌లైన్ యాప్‌లో రూ.30వేల నుంచి 3లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. రూ.10వేలు పెడితే నెల, రెండునెలల్లో రూ.50 నుంచి 60వేలు వస్తాయని నమ్మబలికారు. మంచిర్యాలకు చెందిన ఓవ్యక్తి ఈయాప్‌ను పరిచయం చేసి లింక్‌ను పంపించాడు. పెట్టుబడి డబ్బులకు పెద్ద మొత్తంలో ప్రతినెలా కమీషన్ వస్తుందని ఆశపడ్డారు. యాప్ ఆన్‌లైన్ నుంచి ఎత్తేయడంతో రూ.లక్షలు పోగొట్టుకొని బాధితులు లబోదిబోమంటున్నారు. రామగుండం సైబర్ క్రైం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. యాప్ ద్వారా తాము కోల్పోయిన డబ్బులు తిరిగి తెప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరుతున్నారు. ఈవిషయంపై సైబర్‌క్రైం సీఐ కృష్ణమూర్తిని వివరణ కోరగా తమకు 1930 నంబర్ ద్వారా వచ్చిన ఫిర్యాదులనే పరిగణలోకి తీసుకుంటామని, అయితే అన్‌లైన్ ఫిర్యాదు ఇప్పటివరకు రాలేదన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వెళ్లిన విషయం వాస్తవమే తెలిపారు.

బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి మొండిచేయి



మాట్లాడుతున్న నర్సింగోజు శ్రీనివాస్

కరీంనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులో బీసీ సంక్షేమానికి మొండిచేయి చూపిందని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. కేంద్రబడ్జెట్ 48లక్షల20వేల 512 కోట్ల బడ్జెట్‌లో కేవలం బీసీలకు సంక్షేమానికి 3,300 కోట్లు కేటాయించడం సరికాదన్నారు. కొన్నేళ్లుగా ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు 5,500 కోట్ల పైన బకాయిలుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ సంక్షేమానికి 9,200 కోట్లు సరిపోవన్నారు. ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు గుంటి స్వరూప శ్యాం, యువజన సంఘం నగర అధ్యక్షుడు అనుమాస నితిన్, యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్, యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగోని శ్రీనివాస్, బీసీ సంఘం మహిళా నాయకురాలు సరిత, బీసీసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కన్న కొడుకులు పట్టించుకుంటలేరు

- నా ఆస్తి తిరిగి ఇవ్వమనండి..
- ఆర్డీవో ఆఫీసుకొచ్చిన వృద్ధురాలు



ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన వృద్ధురాలు

జగిత్యాల: 'నా కొడుకులు పట్టించుకోవడం లేదు. నన్ను మంచిగా చూసుకుంటామని నా ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తిండిపెట్టని వారికి నా ఆస్తి ఎందుకు.. ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయండి' అంటూ ఆర్డీవో కార్యాలయానికి ఓ వృద్ధురాలు వచ్చింది. వృద్ధురాలి వివరాల ప్రకారం.. రాయికల్ మండలం కుమ్మరిపల్లికి చెందిన వృద్ధురాలు నర్సమ్మకు ఇద్దరు కొడుకులు. ఇటీవల మంచిగా చూసుకుంటామని చెప్పడంతో తన ఇల్లు, ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసింది. తరువాత ఇద్దరు కొడుకులు నర్సమ్మను పట్టించుకోకుండా బయటకు వెళ్లగొట్టారు. దీంతో కూతురు వద్ద తలదాచుకుంటోంది. దీంతో వారు చేసుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దుచేసి, తనకు న్యాయం చేయాలని, కొడుకులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసింది.

కార్గిల్ అమరులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్‌లో కార్గిల్ విజయ్ దివస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అమరవీరుల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీఎన్ఆర్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధ సమయంలో సైనికుల పోరాటం దేశ చరిత్రలో గొప్ప అధ్యాయంగా నిలుస్తుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించాలి

జగిత్యాల: విద్యార్థులు అనుకున్న లక్ష్యాలు సాధించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు విద్యార్థుల అభిరుచులకు తగ్గట్లు కావాల్సిన వసరులను సమకూర్చాలని, చదువులో ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో ఏదో ఒకటి సాధించాలన్నది పెరిగిందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పారమితలో కార్గిల్ విజయ్ దివస్



రిటైర్డ్ నేవీ అధికారిని సన్మానిస్తున్న పారమిత డైరెక్టర్లు

కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ టీఎస్‌వీ రమణ అమరవీరులకు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ నేవీ అధికారి రమణను ఘనంగా సన్మానించారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాద్‌రావు కార్గిల్ యుద్ధ వీరులను కొనియాడారు. డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్‌రావు, రాకేశ్, ప్రసాద్, వినోద్ రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు నాగరాజు, రాము, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సంఘం, జగిత్యాల (రి.నెం. 240/82)

ఎన్నికల నోటిఫికేషన్

గౌరవ జగిత్యాల పట్టణ పద్మశాలి సేవా సంఘ ఓటరు మహాశయులకు మనవి ఏమనగా ఆగస్టు, 2024 నుండి ఆగస్టు, 2026 వరకు 2 సం॥ల కాలపరిమితికి గాను జగిత్యాల పట్టణ పద్మశాలి సేవా సంఘ కార్యవర్గానికి క్రింద సూచించిన విధముగా ఎన్నికలు జరుపబడును.

తేది: 27-07-2024 శనివారం నుండి 29-07-2024 సోమవారం వరకు	నామినేషన్ల స్వీకరణ (ప్రతిరోజు ఉ॥ 10-30 గం॥ల నుండి మ॥ 3-30 గం॥ల వరకు)
తేది: 30-07-2024 మంగళవారం	నామినేషన్ల పరిశీలన (ఉదయం 12-00 గం॥ల లోపు)
	ఉపసంహరణ (సాయంత్రం 5-00 గం॥ల వరకు మాత్రమే)
తేది: 31-07-2024 బుధవారం	పోటీలో వున్న అభ్యర్థుల ప్రకటన (ఉదయం 10-00 గం॥లకు)
	పోటీలో వున్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు (సాయంత్రం 4-00 గం॥ల నుండి)
తేది: 11-08-2024 ఆదివారం	పోలింగు జరుగు తేది (సమయం: ఉ॥ 8-00 గం॥ల నుండి మ॥ 2-30 గం॥ల వరకు మాత్రమే)
తేది: 11-08-2024 ఆదివారం	ఓట్ల లెక్కింపు - ఫలితాల ప్రకటన (సాయంత్రం 4-00 గం॥ల నుండి)

ఎన్నికలు జరుపబడు పదవులు: 1) అధ్యక్షులు -1, 2) ఉపాధ్యక్షులు-1, 3) ప్రధాన కార్యదర్శి-1, 4) సహాయ కార్యదర్శి-1, 5) కోశాధికారి-1, 6) డైరెక్టర్లు-6

నోట్: ఓటు వేయువారు తమవెంట ఐడికార్డు లేదా ఆధార్‌కార్డు/ఏదేని ఫోటో గుర్తింపు కార్డు తీసుకొని ఓటును వినియోగించుకోగలరు.

స్థలం: శ్రీ భక్త మార్కండేయ దేవాలయం, పద్మశాలి సేవా సంఘం, అంగడి బజార్, జగిత్యాల

ఇట్లు: ఎన్నికల అధికారి, పద్మశాలి సేవా సంఘం, జగిత్యాల

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్&డిస్టెన్స్ అడ్మిషన్స్:డిగ్రీ,PG, B.Tech ,Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc (నర్సింగ్), GNM. * 4 నెలల్లో పరీక్షలు 8866977112, 339 [HA-16328]

SERVICES

OLD AGE HOME

■ త్రినేత్రహోంకేర్ వృద్ధులను,పేషెంట్స్‌ను, చంటిపిల్లలను, వంట / ఇంటిపని 24 గం॥లు చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే కేర్ టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. ఫోన్: 7396857799,7396753377 [H-796261]

WANTED

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటిపని,వంటపనికి వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి + భోజనం. జీ: 20 K. ఫోన్: 8977639662, 8977639663 [H-796259]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824